అంగన్‌వాడీల 'యాప్‌' సోపాలు

- ఫోన్లలో లబ్ధిదారుల నమోదుకు తిప్పలు
- బాలింతలు, గర్భిణుల గుర్తింపునకు ఇబ్బందులు
- సరిగ్గా పనిచేయని బాల సంజీవని, పోషణ ట్రాకర్ యాప్‌లు



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు (ఫైల్)

రాయచోటి జగదాంబసెంటర్ : అంగన్‌వాడీ కార్యకర్తలు యాప్‌లతో అవసోపాలు పడుతున్నారు. ముఖ్యంగా పోషణ ట్రాకర్, బాల సంజీవని యాప్‌ల్లో లబ్ధిదారుల ముఖ హాజరు నమోదుకు ఇబ్బందులు పడుతున్నారు. ఒకే వ్యక్తి వివరాలను రెండు యాప్‌ల్లో నమోదు చేయడం, రెండుసార్లు ఫేస్ యాప్ గుర్తించేందుకు ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు సపోర్టు చేయడం లేదు. ముఖచిత్ర గుర్తింపునకు పడరాని పాట్లు పడుతున్నారు. మరోపక్క 15 రకాల రికార్డుల నిర్వహణతో సతమతమవుతున్నారు. లబ్ధిదారులకు పోషకాహారం పంపిణీ చేయాలంటే తప్పనిసరిగా ముఖచిత్ర గుర్తింపు చేయాల్సిందే. అలా చేయకుండా ఆహార పదార్థాలను అందించలేరు. యాప్‌లు సరిగ్గా పనిచేయకపోవడం, 2జీ ఫోన్లతో సకాలంలో ముఖచిత్ర గుర్తింపు ప్రక్రియ జరగకపోవడంతో ఇటు లబ్ధిదారులు, అటు అంగన్‌వాడీ కార్యకర్తలు అవస్థలు పడుతున్నారు. యాప్‌లు, రికార్డుల్లో వారు తలమునకలై ఉంటుండడంతో పూర్వ ప్రాథమిక విద్య పూర్తిగా దెబ్బతింటుంది. ఈ బాధలు పడలేని అంగన్‌వాడీ కార్యకర్తలు యాప్‌ల భారం తగ్గించాలని ఆందోళన చేపడుతున్నారు.

సక్రమంగా సాగని పంపిణీ

లబ్ధిదారులకు పోషణ ట్రాకర్, బాల సంజీవని అందించాలంటే రెండు యాప్‌లు నిర్వహించాలి. లబ్ధిదారు ఫేస్ రికగ్నైజ్ చేసి యాప్‌లో నమోదు చేయాలి. అయితే 2జీ ఫోన్ల వల్ల నెట్‌వర్క్ సరిగా రాక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ గుర్తింపు చాలాసార్లు సక్సెస్ కావడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు. ప్రభుత్వం బాలసంజీవని ద్వారా లబ్ధిదారులకు ముఖ గుర్తింపుతో బియ్యం ఇస్తోంది. ఇప్పుడు తాజాగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పోషణ ట్రాకర్ ద్వారానే లబ్ధిదారులను గుర్తించి సరుకులు ఇవ్వాలనే నిబంధనను తప్పనిసరి చేయడంతో కార్యకర్తలు ఈ రెండు యాప్‌లను వినియోగించాల్సి వస్తోంది. ఇది కష్టంగా ఉందని అంగన్‌వాడీలు వాపోతున్నారు.

2జీ ఫోన్లతో తిప్పలు

పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో నెట్‌వర్క్ కష్టాలు అధికంగా ఉండటంతో కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. మొబైల్ ర్యామ్ తక్కువగా ఉండటంతో యాప్ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2జీ ఫోన్లు వద్దని 5జీ ఫోన్లు ఇవ్వాలని వారు కోరుతున్నారు. ఇటీవలే సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ నిరసన చేపట్టి 5జీ ఫోన్లు ఇవ్వాలని ఆందోళన చేశారు.

అంగన్‌వాడీలు నిర్వహించే రికార్డులు

- పిల్లలు, గర్భిణీలు, బాలింతలను నమోదు చేసే రికార్డులు (ఎస్ఎన్ఎన్)
- ప్రీస్కూల్ అడ్మిన్ విద్యార్థుల వివరాల నమోదు
- పిల్లలకు అందించే టీకాలకు సంబంధించిన రిజిస్టర్
- విటమిన్‌-ఏ రికార్డు, రిఫరల్ సర్వీసెస్ గృహ సందర్శకుల రికార్డులు
- లబ్ధిదారులకు అందించే ఆహార వినియోగం (ఎఫ్‌సీఆర్)
- గ్రోత్ రికార్డ్, గ్రోత్ చార్టులు
- నెలవారీ ప్రాజెక్టు (ఎంటీఆర్)
- ఆయా అంగన్‌వాడీల పరిధిలోని హౌస్ హోల్డ్ సర్వే
- స్టాఫ్ అడ్మిషన్ రిజిస్టర్ నిర్వహణ
- చిన్నారుల, గర్భిణీలు, బాలింతలకు సంబంధించిన టేక్ హోం రేషన్ పంపిణీ రికార్డు

యాప్‌ల భారంతో అందని విద్య



రికార్డుల నిర్వహణ, యాప్‌ల భారంతో చిన్నారులకు ప్రాథమిక విద్య బోధించేందుకు అంగన్‌వాడీలు ఇబ్బందులు పడుతున్నారు. దానికితోడు 2జీ ఫోన్లు ఇచ్చి పలు రకాల యాప్‌ల భారం వారిపై మోపడం తగదు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించి 5జీ ఫోన్లు పంపిణీ చేయాలి.

– ఎ.రామాంజులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, రాయచోటి

క్లుప్తంగా

ఆంజనేయస్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి పట్టణ పరిధిలో శ్రావణ మాస మూడో శనివార వేడుకలను ఆంజనేయస్వామి ఆలయాల్లో వైభవంగా నిర్వహించారు. కొత్తపేట గ్రూప్ థియేటర్స్ వద్ద ఉన్న ప్రసన్న ఆంజనేయస్వామి, బ్రాహ్మణవీధిలో ఆంజనేయ స్వామి, మాసాపేటలోని గండ్రాంజనేయ స్వామి, సుండుపల్లె రోడ్డు మార్గంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రావణ మాస మూడో శనివార వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూలవిరాట్ మూర్తులను పలురకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు సింధూర పూజలు, ఆకుపూజలు తదితర పూజాది క్రతువులను నిర్వహించగా సమీప ప్రాంతాల భక్తులు పలువురు పాల్గొన్నారు.



పూజలందుకుంటున్న ఆంజనేయుడు

చిన్నమండెం : మండల పరిధిలోని పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రావణ మాస సందడి నెలకొంది. మూడో శనివారం కావడంతో భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఆంజనేయస్వామి మూలవిరాట్‌మూర్తులను పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం ఆకుపూజలు, సింధూర పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. సమీప ప్రాంతాల భక్తులు పలువురు స్వామిని దర్శించుకోగా ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

గాలివీడు : శ్రావణమాసం మూడవ శనివారం సందర్భంగా అరవీడు ఆంజనేమయస్వామి ఆలయం, గండిమడుగు ఉమామహేశ్వర స్వామి ఆలయం, పెదకంటి కొత్తపల్లె ఆంజనేయస్వామి ఆలయం, శివపురం వాండ్లపల్లె ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు కొనసాగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చిన స్వామి వారిని దర్శించుకున్నారు.

అనుబంధాల రాఖీ



రాయచోటి టౌన్: ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



సంబేపల్లె : సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి

రాయచోటి టౌన్ : అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లు ఆనందంగా జరుపుకునే మహోత్తరమైన పండుగ రాఖీపౌర్ణమి అని రాయచోటి శ్రీ వీరభద్రస్వామి ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు అన్నారు. శనివారం భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో రక్షబంధన్ కార్యక్రమం అత్యంత పవిత్రంగా నిర్వహించి స్వామి వారికి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి వచ్చిన సోదరులకు, సోదరీమణులు రాఖీలు కట్టారు. సోదర, సోదరీమణుల ఆత్మీయ అనుబంధానికి రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఆలయ ఈవో డీవీ రమణ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్య స్వామి, శంకరయ్య స్వామి, శేఖర్ స్వామి, రాచరాయయోగీ స్వామి, మల్లికార్జున స్వామిలు పాల్గొన్నారు.

నివాళి



నరసమ్మ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, నాయకులు

లక్కిరెడ్డిపల్లి : మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య, తల్లి నరసమ్మ (80) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి ఫోన్‌లో రెడ్డయ్య కుటుంబాన్ని పరామర్శించారు. లక్కిరెడ్డిపల్లి ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి శనివారం నరసమ్మ మృతదేహానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్ వెంకట నారాయణ రెడ్డి, మైనార్టీ నాయకులు బాబ్జాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాఘవరెడ్డి, ప్రసాద్ రెడ్డి, నాగేశారెడ్డి నరసమ్మ మృతదేహానికి నివాళులు అర్పించారు. ఆదివారం ఉదయం 10 గంటలకు దప్పేపల్లి గ్రామం, జంద్రపల్లిలో నరసమ్మకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు

రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరీ రెడ్డి



రాయచోటి: కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలు రక్షణ కరువైందని రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరీ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం రాయచోటిలో పత్రికలకు విడదల చేసిన ప్రకటనలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేపడుతున్న కుట్రలపై ఆమె మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మోసానికి ఆడబిడ్డలు మరోసారి బలయ్యారని తెలిపారు. అధికారంలోకి వస్తే సంపద సృష్టించి జగనన్న ఇచ్చిన హామీలకంటే రెట్టింపు హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ హామీల పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 14 నెలల పాలనలో వాటిని అమలు చేయకుండా పేద, మధ్య తరగతి కుటుంబాలు రోడ్డున పడేలా మద్యాంధ్రప్రదేశ్ చేసేందుకు బార్లకు పరిమిట్లు, రూమ్స్‌కు క్యాబినేట్ ఆమోదం తెలిపిందన్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయం మహిళల పాలిట శాపంలా మారిందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు మహిళల జీవితాలను ఆర్థికంగా నాశనమయ్యేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజల సంపదను దోచుకునేలా నూతన మద్యం పాలసీలతో సంపద సృష్టించాలనే కుటిల ఆలోచనలు చేస్తున్నారని విమర్శించారు. జగనన్న ప్రభుత్వంలో 33 శాతం మద్యం షాపులు తగ్గించడమే కాకుండా వాటికి అనుబంధంగా ఉన్న పర్మిట్ రూములను దాదాపు 43 వేల బెల్ట్ షాపులను రద్దు చేయడం జరిగిన విషయం గుర్తించుకోవాలన్నారు. జాతీయ ఎక్సైజ్ విధానానికి విరుద్ధంగా పర్మిట్ రూములు ఇస్తూ విష సంస్కృతికి తెర తీశారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలులో పూర్తిగా విఫలమైన చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ కక్ష సాధింపులు, దాడులకు దిగుతున్నారని పేర్కొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం

- ఆదివాసీల సంస్కృతి, హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించాలి
- జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్



మాట్లాడుతున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

రాయచోటి : ఆదివాసీల సంస్కృతి, హక్కుల పరిరక్షణపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగాన్ని డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ రూపొందించేటప్పుడు ఆదివాసీల హక్కుల కోసం అధికరణ 46, 332 వంటి అధికరణలతో ఆదివాసీలకు హక్కులను కల్పించారని జేసీ అన్నారు. అలాగే రాజ్యాంగంలోని షెడ్యూల్ 5,6లతో ఆదివాసీలకు స్వయం పరిపాలన దిశగా హక్కులను కల్పించారన్నారు. జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గిరిజనులకు సంబంధించిన పథకాలు, హక్కులపై తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లాలోని 12 గిరిజన సంక్షేమ పాఠశాలలు గిరిజన సంక్షేమ హాస్టల్లో వసతులు, విద్యపై మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు దగ్గర నుండి నివేదికలు అందుతున్నాయని, సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఆదివాసీలు పర్యావరణ పరిరక్షణకు, సేంద్రియ వ్యవసాయానికి, అడవుల పరిరక్షణకు ఎంతో కృషి చేస్తున్నారని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి తేజశ్వనీ కొనియాడారు. జిల్లాలో గిరిజన హాస్టల్‌లో బాలల కంటే బాలికలు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని గిరిజన నాయకులు మాట్లాడారు. వేడుకలలో డీఆర్ఓ మధుసూదనరావు, సిబ్బంది, రైల్వేకోడూరు జెడ్పీటీసీ రత్నమ్మ, గిరిజన నాయకులు, గిరిజన విద్యార్థులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులతో ప్రతిభ మెరుగు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

రాయచోటి టౌన్ : టాలెంట్ టెస్టులతో విద్యార్థుల్లోని ప్రతిభ మెరుగవుతుందని, పరీక్షలంటే సహజంగా ఉండే భయం పోతుందని కడప డివిజన్ ఏజీఎండీ రమణయ్య అన్నారు. రాయచోటి బ్రాంచ్ -5లో చదువుతున్న శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. శనివారం (ఐఎన్‌టీఎస్ఓ) ఇండియన్ నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలంపియాడ్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలతో పాటు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు టాలెంట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని కొనియాడారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కళాభారతి, శివార్జున రెడ్డి, నరేంద్ర, బీవీ ప్రసన్న కుమారి, రాధిక, వైస్ ప్రిన్సిపాల్ జీవానందం, సెలెన, ఏవో వెంకట్రాజు, రామనాథ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

సిద్దవటం: మండలంలోని బొగ్గిడివారిపల్లె గ్రామ సచివాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కుప్పాల వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సదర్భంగా తిరుపతిలోని రమాదేవి మల్టీ స్పెషాలిటీ వైద్యుడు డాక్టర్ వెంకటరమణ దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా వైద్యపరీక్షలను నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బొగ్గిడివారిపల్లె గ్రామ సమీపంలోని నేకనాపురం, ఆకురోపల్లె, పాలకొండ్రాయునిపల్లె, వడ్డివారిపల్లె, చాముండేశ్వరిపేట, గ్రామాలకు చెందిన వారు ఈ వైద్య శిబిరానికి వచ్చి వైద్యం చేయించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



మత పెద్దలతో చర్చిస్తున్న పోలీసులు

రాయచోటి టౌన్ : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతి హెచ్చరించారు. శనివారం రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఆదివారం రాయచోటిలో పర్యటిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో బీజేపీ నాయకులు ర్యాలీ నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ర్యాలీ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు సృష్టించినా.. అల్లర్లకు పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

కలికిరి(వాల్మీకిపురం): లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని డిప్యూటీ హెచ్ఈఓ మహమ్మద్ రఫీ అన్నారు. వాల్మీకిపురం మండలం విఠలంలో శనివారం లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణకు సహకరించిన వైద్యులు, ప్రోత్సహించిన కుటుంబసభ్యులు నేరస్తులవుతారన్నారు. గర్భిణికి స్కానింగ్‌లు కేవలం పిండం ఆరోగ్య స్థితిని తెలుసుకోవడానికి మాత్రమేనన్నారు. సీహెచ్ఓ రెడ్డెమ్మ, సీసీ.రెడ్డెప్ప, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరు



ఒంటిమిట్ట : వృద్ధుడిని ఓటు అభ్యర్థిస్తున్న గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ బీహెచ్, గల్ఫ్, కువైట్, దుబాయి కమిటీ సభ్యులు



పుల్లంపేట : ఎన్నికల ప్రచారం చేస్తున్న పుల్లంపేట మండల కన్వీనర్ ముస్తాక్, వైఎస్సార్‌సీపీ నాయకులు

గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ బీహెచ్

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలో కూటమి నాయకులు ఎన్ని కుయుక్తులు పన్నినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరని గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ బీహెచ్ స్పష్టం చేశారు. శనివారం గల్ఫ్ కువైట్, దుబాయి కమిటీ సభ్యులతో కలిసి ఆయన ఇంటింటికి తిరిగి వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం నాయకులు ఎన్ని కుట్రలు, కుయుక్తులు పన్నినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెడ్పీటీసీ అభ్యర్థి విజయం తథ్యమన్నారు. చంద్రబాబు ఇప్పటివరకు ఎన్నికల హామీలను అమలు చేయలేదని విమర్శించారు. కూటమి పాలనలో ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. హామీలిచ్చి మోసం చేయడం చంద్రబాబు నైజమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్, కువైట్, దుబాయి కమిటీ సభ్యులు నాయనీ మహేశ్వర్ రెడ్డి, మన్నూరు చంద్రశేఖర్ రెడ్డి, సయ్యద్ అక్రమ్, పులపుత్తూరు సురేష్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అలీ అక్బర్, అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్, 31 డివిజన్ కార్పొరేటర్ అజ్మతుల్లా, ఎన్ఆర్ఐ షేక్ గయాజ్, పి. రెహమాన్ ఖాన్, షేక్ షారూక్, మాజీ కో–ఆప్షన్ సభ్యులు రఫీ పాల్గొన్నారు.

సుబ్బారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

పుల్లంపేట : ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి గెలిపించి కూటమి ప్రభుత్వానికి సరియైన గుణపాఠం చెప్పాలని పుల్లంపేట మండల కన్వీనర్ ముస్తాక్ అన్నారు. శనివారం ఒంటిమిట్ట మండలంలోని పోలిబుచ్చయ్యగారిపల్లి, తప్పెటవారిపల్లి గ్రామాల్లో జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అయినా ఒక్క హామీ నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని తెలిపారు. అమూల్యమైన ఓటును సుబ్బారెడ్డికి వేసి గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కడప పార్లమెంటరీ పరిశీలకులు కొండూరు అజయ్ రెడ్డి, రైల్వేకోడూరు పంచాయతీ వింగ్ ప్రెసిడెంట్ ఎం.శంకర్ రెడ్డి, రామనాథం, ఎం.వెంకటరెడ్డి, కుమార్ రెడ్డి, రిజ్వాన్ పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కోసం పూజలు



భక్తులకు అన్నదానం చేస్తున్న ఎంపీపీ

వీరబల్లి : అక్రమ కేసులో అరెస్టయిన ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కావాలని కోరుతూ మండలంలోని పుల్లగూర గండిలో ఆంజనేయస్వామికి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే ఆంజనేయస్వామి గుడి వద్ద భజనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దిరెడ్డి కుటుంబంపై కూటమి నాయకులు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. అక్రమ కేసులకు పెద్దిరెడ్డి కుటుంబం భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై మరింతగా పోరాడుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భక్తులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవార్లు

గాలివీడు : గాలివీడు పట్టణంలోని పెద్దరు వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీనివాసుడి కల్యాణం కమనీయంగా జరిగింది. శ్రావణ మాసం మూడవ శనివారాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు రంగనాయకులు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవర్లను కల్యాణవేదిక వద్దకు తీసుకొచ్చారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య విశ్వక్సేన ఆరాధన, పుణ్యహవచనం, కంకణధారణ, మంగళసూత్రధారణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. నక్షత్రహారతి, మంగళహారతి కార్యక్రమంతో కల్యాణం ఘట్టం ముగిసింది. కల్యాణానికి విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

సంబేపల్లె : మండల పరిధిలోని మోటకట్ల వెంకట శివసాయి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా వేదపండితులు సీతారాములను ముస్తాబు చేసి కనుల పండువగా కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నృసింహుడికి..



కల్యాణ వేదికపై ఉత్సవ మూర్తులు

రాజంపేట రూరల్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన భువనగిరి లక్ష్మీదేవి సమేత నృసింహస్వామి కళ్యాణ మహోత్సవాన్ని శనివారం వేడుకగా నిర్వహించారు. లక్ష్మీదేవి, నృసింహ స్వామి ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలతో, ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక వేదికపై ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి వేదపండితులు వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారికి భువనగిరిపల్లి కోదండరామస్వామి ఆలయం నుంచి కొండపైకి భక్తులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొచ్చి స్వామి వారికి సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కల్యాణ మహోత్సవంలో ఆలయ ధర్మకర్తలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

సత్యనారాయణ స్వామి వ్రతం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

రాయచోటి జగదాంబసెంటర్ : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని ప్రసిద్ధ సాయిబాబా ఆలయంలో పౌర్ణమి సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తుల భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సత్యనారాయణ స్వామి వ్రత సమయంలో పురోహితులు మంత్రోచ్చారణలతో, హారతులతో ఆలయ వాతావరణాన్ని ఆధ్యాత్మికతతో నింపారు. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు పాల్గొని తమ కుటుంబ శ్రేయస్సు కోసం నైవేద్యాలను సమర్పించారు. అనంతరం సాయిబాబా నామస్మరణతో ఆలయం మార్మోగింది. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం బాబా హారతి కార్యక్రమం కనుల పండువగా సాగింది.

గంగరాజుపురంలో..



సత్యనారాయణ స్వామి వ్రతం చేస్తున్న భక్తులు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రాఘవరాజపురం పంచాయితీ గంగరాజుపురంలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం శ్రావణపౌర్ణమి పురస్కరించుకొని సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి సామూహిక వ్రతంలో పాల్గొన్నారు.

అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సమాజంలో సత్యనిష్ఠ నెలకొనాలని సత్యనారాయణస్వామి సామూహిక వ్రతం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

ముత్తుమారెమ్మ గ్రామోత్సవం



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ అరవపల్లిలో వెలసిన ముత్తుమారెమ్మ తల్లి గ్రామోత్సవం శనివారం రాత్రి అత్యంత ఘనంగా జరిగింది. నెల్లూరుకు చెందిన సేలం సురేష్, సేలం సుధాకర్ అమ్మవారికి ఉభయాన్ని అందజేశారు. భక్తులు అమ్మవారికి కాయ, కర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో ఉదయం పండితులు బండాత్మకూరు శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కుంకుమార్చనలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. చెన్నైకి చెందిన నాగరాజు, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఆలయ వార్షికోత్సవం



హోమం చేస్తున్న భక్తులు

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు కొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన కార్యసిద్ధి వినాయక స్వామి ఆలయ మొదటి వార్షికోత్సవం సందర్భంగా గణనాధుడికి శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమాలను భక్తులు ఉదయం నుండే ఆలయంలో వినాయక స్వామిని దర్శించుకొని తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయం ఎదుట కొత్తపల్లి గ్రామానికి చెందిన టి. రమణారెడ్డి దంపతులు చండీహోమం నిర్వహించారు. ఆలయంలో వినాయకుడిని పూలమాలలతో అలంకరించారు. మధ్యాహ్నం తలవంచి గిరీష్ రెడ్డి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. వేల సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు చేసి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.